వసతికి గ్రహణం



వరదయ్యపాళెంలో మూతపడనున్న బాలుర బీసీ హాస్టల్

ఆరు దశాబ్దాల పాటు ఎందరో విద్యార్థులకు ఆశ్రయమిచ్చిన వరదయ్యపాళెం బీసీ హాస్టల్‌కు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కారు స్కూళ్లు, వసతిగృహాల పట్ల చిన్నచూపు చూస్తోంది. గతంలో స్కూళ్లను మూసివేసినట్లే ఇప్పుడు హాస్టల్‌ను మూసివేసేందుకు రంగం సిద్ధమైంది. బాలు వసతిగృహం మూసివేతి సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది.

- ఆరుదశాబ్దాల పాటు ఎందరో విద్యార్థులకు ఆశ్రయమిచ్చిన వరదయ్యపాళెం బీసీ హాస్టల్
- వసతిగృహం మూసివేతకు ముందు నుంచే అధికారుల స్కెచ్
- ఈ ఏడాది స్కూళ్లు ప్రారంభమైన 50 రోజుల తరువాత మొక్కుబడిగా తెరుచుకున్న హాస్టల్
- ఈ ఏడాది కొత్త అడ్మిషన్లు కూడా ఇవ్వని వైనం
- ప్రస్తుతం ఉన్న 20 మంది విద్యార్థులను ఎస్సీ హాస్టల్‌లో చేర్చేందుకు అనుమతులు
- డిసెంబర్ మొదటివారంలో బీసీ బాలికల హాస్టల్ ఏర్పాటుకు చర్యలు

వరదయ్యపాళెం: మండలకేంద్రంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్ మూసివేతకు ప్రభుత్వం సిద్ధమైంది. ఆ మేరకు ఈ నెలాఖరుకు హాస్టల్‌ను మూసి వేసేందుకు అధికారులు సంసిద్ధులయ్యారు. వరదయ్యపాళెంలో 60 ఏళ్లుగా ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని వెనుకబడిన వర్గాల విద్యార్థులకు దూరం చేయడం పట్ల అటు విద్యార్థుల తల్లిదండ్రులు ఇటు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అధికారులు హాస్టల్ మూసివేతకు ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లారు.

నమోదు కాని నూతన అడ్మిషన్లు..

హాస్టల్ మూసివేతకు ముందస్తుగానే అధికారులు వ్యూహరచన చేశారు. ఈ ఏడాది హాస్టల్‌లో విద్యార్థులు చేరేందుకు నూతన అడ్మిషన్లు సైతం ఇవ్వలేదు. గత ఏడాది ఉన్న 17 మంది విద్యార్థులను అలాగే కొనసాగించి, వారితో పాటు ఓ ముగ్గురు విద్యార్థులను కొత్తగా చేర్చుకున్నారు. ఏటా 50 మంది పైచిలుకు విద్యార్థులు హాస్టల్‌లో అడ్మిషన్ తీసుకునేవారు. ఆ సంఖ్యను కాస్త ఈ ఏడాది 20 మందికే పరిమితం చేశారు.

ఉన్నవారిని ఎస్సీ హాస్టల్‌లో చేర్చేలా..

ప్రస్తుతం హాస్టల్‌లో ఉన్న 20 మంది బీసీ విద్యార్థులను వరదయ్యపాళెంలోని ఎస్సీ హాస్టల్‌లో చేర్చేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు హాస్టల్ అధికారులు చెబుతున్నారు. ఆ దిశగా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఎస్సీ హాస్టల్‌కు వెళ్లలేని విద్యార్థులు ఇక హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్లాల్సిందేనని ముందస్తు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

బీసీ బాలికల హాస్టల్ ఏర్పాటుకు..

అయితే బీసీ బాలుర హాస్టల్‌ను మూసివేసి బాలికల హాస్టల్ ఏర్పాటుకు అధికారులు సిద్ధమయ్యారు. మండల కేంద్రంలో ఏర్పాటు కానున్న బీసీ బాలికల వసతి గృహానికి సంబంధించి అద్దె భవనం కోసం అధికారులు పరిశీలన చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న బీసీ హాస్టల్ భవనం భద్రత రీత్యా బాలికలకు అంతగా అనువైనది కాదని భావిస్తున్నారు. డిసెంబర్ మొదటివారంలో అధికారికంగా హాస్టల్ ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆ మేరకు తొట్టంబేడు మండలంలోని బీసీ హాస్టల్ వార్డెన్‌కు కూడా వరదయ్యపాళెంలో నూతనంగా ఏర్పాటుకానున్న బాలికల బీసీ హాస్టల్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించినట్లు సమాచారం. అయితే విద్యా సంవత్సరం ప్రారంభమై సగభాగం పూర్తయిన పరిస్థితుల్లో హాస్టల్‌లో ఏ మేరకు అడ్మిషన్లు వస్తాయో వేచి చూడాలి.

60 ఏళ్ల చరిత్ర కలిగిన వసతిగృహం..

ఎన్నో ప్రభుత్వాలు మారినప్పటికీ వరదయ్యపాళెంలో 60 ఏళ్ల కిందట ఏర్పాటైన బీసీ బాలుర వసతి గృహం నిరాటంకంగా కొనసాగుతోంది. కానీ ఈసారి అధికారంలోకి వచ్చిన కూటమి బీసీ హాస్టల్‌ను మూసివేస్తుండడంపై ఆగ్రహ జ్వాలలు వ్యక్తం అవుతున్నాయి. విద్యార్థులు లేరన్న కారణాన్ని కూడా ప్రభుత్వమే ప్రణాళికాబద్ధంగా రచించింది. విద్యాసంవత్సరం ప్రారంభంలో కొత్త అడ్మిషన్లను ఇవ్వకుండా అధికారులు పక్కా ప్రణాళిక రచించారు. వసతిగృహంలో సీటు కోసం అనేక మంది విద్యార్థులు తిరిగినప్పటికీ ఇవ్వకపోవడమే అందుకు ఉదాహరణ.

నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి..



వరదయ్యపాళెంలో 60 ఏళ్లుగా కొనసాగుతున్న బీసీ బాలుర హా స్టల్‌ను మూసి వేసేందుకు తీ సుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం పునరాలోచన చేయాలి. వెనుకబడిన వర్గాల వారి పిల్లలకు హాస్టల్ మూసివేతతో ఇబ్బందికరం. ఉన్న హాస్టల్‌ను మూసివేస్తే ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు ఇబ్బంది. దీనిపై ప్రభుత్వానికి విన్నవిస్తాం. – అంబాకం చిన్నిరాజ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, వరదయ్యపాళెం

ఆందోళన చేపడతాం..



బీసీ హాస్టల్ మూసివేస్తే ఆందోళన చేపడుతాం. పేద విద్యార్థులు చదివే వసతి గృహాలను మూసివేయడం కూటమి ప్రభుత్వానికి తగదు. ఈ పరిణామం మండల విద్యార్థులకు ఆందోళనకరం. కూటమి ప్రభుత్వ నిర్ణయం ప్రజా వ్యతిరేకతకు నాంది పలుకుతోంది. – తరుణ్, ఏఐఎస్ఎఫ్, నియోజకవర్గ సభ్యులు

ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే..

వరదయ్యపాళెం బీసీ బాలుర హాస్టల్‌ను మూసి వేసి ఆ స్థానంలో బాలికల బీసీ హాస్టల్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిసెంబర్ 1 నుంచి ప్రస్తు తం హాస్టల్‌లో ఉన్న విద్యార్థులను ఎస్సీ హాస్టల్‌లో చేర్పిస్తాం. బాలికల హాస్టల్ ఏర్పా టుకు సంబంధించి వరదయ్యపాళెంలో నూతన భవనం కోసం పరిశీలన చేస్తున్నాం. అంతా ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే జరుగుతుంది. – రామయ్య, వరదయ్యపాళెం బీసీ హాస్టల్ ఇన్‌చార్జ్ వార్డెన్

క్లుప్తంగా

మహిళలను గౌరవిద్దాం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి: మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ దీనదయాల్ అన్నారు. పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ స్త్రీహింస వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్టీవెన్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోహన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివశంకర్‌నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ చైర్మన్‌కు సన్మానం



రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా హ్యూమన్‌రైట్స్ చైర్మన్‌గా ఎన్నికైన గండవరం రామచంద్రారెడ్డిని శనివారం శ్రీకాళహస్తి రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ప్రజాహక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

నాగలాపురం: మండల కేంద్రంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ వేదవల్లి సమేత శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో శనివారం అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి మాట్లాడుతూ ఆలయంలో ప్రతి శనివారం దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శనివారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు దాతలుగా వ్యవహరించినట్లు ఆయన తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



రోడ్డుపై పడిపోయిన విశ్వనాథ రెడ్డి

నాగలాపురం: రోడ్డు పక్కన ఆపి ఉంచిన బొలేరో వాహనాన్ని వెనుక నుంచి వచ్చి ఓ ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మండలంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. తమిళనాడులోని పాలవాక్కం గ్రామానికి చెందిన విశ్వనాథ రెడ్డి(72) పని మీద విజయపురం మండలం పన్నూరు గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో కారణి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఆపిన బొలేరో వ్యాన్‌ను ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమైంది. అతన్ని వెంటనే అంబులెన్స్‌లో నాగలాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు ప్రథమ చికిత్స అందించి పరిస్థితి విషమం కావడంతో నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క రూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు ప్రతి పౌరుడి హక్కు అని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా బుచ్చినాయుడుకండ్రిగ, కాంపాళెం గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన బీఎల్ఓలకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. నేడు, రేపు ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

సత్యవేడు: 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దారు సుబ్రమణ్యం కోరారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాబు డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు నమోదుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారికి ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని, పోలింగ్ కేంద్రాలు, బీఎల్‌ఓల వద్ద ఓటు నమోదుకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంటాయన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక



హెచ్‌ఎం పూడి కస్తూరయ్య

నాగలాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పూడి కస్తూరయ్య రాష్ట్ర ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు నేడు విజయనగరంలో జరగనున్న కార్యక్రమంలో అధికారుల నుంచి అవార్డు స్వీకరించనున్నారు. అవార్డుకు ఎంపికపై పలువురు కస్తూరయ్యను అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన

నారాయణవనం: అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాజశేఖర్ సూచించారు. శనివారం మండలంలోని వేదవ్యాస డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, లింక్‌లతో పొదుపు ఖాతాల నుంచి నగదును కోల్పోవడమే కాకుండా ఆర్థిక నేరాలలో భాగస్వామ్యం అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. మహిళలపై దాడులు, వేధింపులకు పాల్పడే వారిని చట్టం ఉపేక్షించదన్నారు. నేరాల నియంత్రణకు 112 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

26న జిల్లా కేంద్రాల ముట్టడి



మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

శ్రీకాళహస్తి: కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 26న దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాల ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో వ్యవసాయం, కార్మిక రంగం కుదేలైందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్దన్, కార్యదర్శి హేమత, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆహార వినియోగంలో ఐయోడిన్ ప్రధానం

బుచ్చినాయుడుకండ్రిగ: మనిషి ఆహారపు అలవాట్లలో భాగంగా ఐయోడిన్ ప్రధానం అని, ఆహార పదార్థాలలో ఉప్పును అతిగా వినియోగిస్తే ప్రమాదాలు తప్పవని ప్రజాప్రగతి ట్రస్టు అధ్యక్షుడు సుబ్రమణ్యం తెలిపారు. శనివారం మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఐయోడిన్ లోపం వల్ల జరిగే అనర్థాలు, ఉపయో గాలపై హెచ్‌ఎం రూపేష్‌కుమార్ అధ్యక్షతన అవగాహన కల్పించారు. అలాగే ఐయోడిన్ వినియోగంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరచిన వారికి ధ్రువపత్రాలు అందించారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

సర్వేను త్వరగా పూర్తి చేయండి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రవీంద్రబాబు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీలతో జరుగుతున్న స్వర్ణ పంచాయతీ సర్వేను త్వరగా పూర్తి చేయాలని సూళ్లూరుపేట డీఎల్‌పీఓ రవీంద్రబాబు తెలిపారు. ఆయన శనివారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ సచివాలయాలన్ని ఆకస్మిక తనిఖీ చేసి, సిబ్బందితో స్వర్ణ పంచాయతీ సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 9060 ఇళ్లను సర్వే చేయవలసి ఉండగా ఇప్పటికి 1290 ఇళ్లు మాత్రమే సర్వే చేసి ఉన్నారని, మొత్తం 14 శాతం చేశారని, మిగిలిన సర్వేను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. స్వర్ణ పంచాయతీ సర్వేలో ప్రతి ఇంటి డేటాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని, దీంతో హౌస్ ట్యాక్స్‌ను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు. కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఈ నెలాఖరుకు సర్వేను పూర్తి చేసి, డిసెంబరు నుంచి ఆన్‌లైన్ ట్యాక్స్ వసూలు చేయాలన్నారు. పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం, ఉపసర్పంచ్ మునిరాజా, తదితరులు పాల్గొన్నారు.

జూడో క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో శాప్ చైర్మన్ రవి నాయుడు

రేణిగుంట: రేణిగుంటలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ అండర్–19 జూడో చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి రాష్ట్ర శాప్ చైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడారంగంలో ముందంజలో ఉన్న హర్యానా, గుజరాత్, ఒడిశా రాష్ట్రాలను సైతం తలదన్నేలా ఏపీ స్పోర్ట్స్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. తిరుపతి డిప్యూటీ డీఈఓ బాలాజీ, డీఎస్డీఓ సయ్యద్‌సాహెబ్, డీఐఈఓ విశ్వనాథ్‌నాయక్, హెచ్‌ఎం విష్ణువర్ధనం పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణే లక్ష్యం



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసులు

నారాయణవనం: సీజనల్ వ్యాధులతో పాటు అంటు, దీర్ఘకాల వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కుష్టు, డయేరియా, దోమల నివారణపై అవగాహనా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, పొడలు, మందంగా మారి నొప్పితో కూడిన నరాలు, బొడిపెలు నొప్పిలేని పుండ్లు మొదలైన లక్షణాలను కుష్టు వ్యాధిగా నిర్ధారించుకుని దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ రాగసుధ, హెచ్‌ఎం సులోచన సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల పంచాయతీ పరిధిలోని పచ్చాలమ్మ కాలనీ వద్ద కేటీరోడ్డుకు ఓ వైపున ఉన్న ఉన్నత పాఠశాల ప్రహరీ పక్కన ఆక్రమణలను తొలగించారు. శనివారం ఆర్‌అండ్‌బీ డీఈ రాంబాబు, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎస్ఐ విశ్వనాథనాయుడు, ఎంఈఓ రవీంద్రనాథ్ ఆక్రమణలపై స్పందించారు. స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని గదులను నిర్మించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అధికారులు జేసీబీతో తొలగించారు.

ఘనంగా సత్యసాయి జయంతి



బాబా ప్రతిమకు పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో గల శ్రీసత్యసాయి మందిరంలో శనివారం సత్యసాయి 99వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. సత్యసాయిబాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ట్రస్టు సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

దిన చర్యగా మొక్కల పెంపకం



మొక్కలను పరిశీలిస్తున్న విద్యార్థులు

నారాయణవనం: మొక్కలను, పెరటి కోళ్ల పెంపకం, వాటి సంరక్షణ దినచర్యలో భాగం కావాలని శాస్త్రవేత్తలు సూచించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలోని మొక్కల సాగు క్షేత్రాన్ని శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. క్షేత్రంలో అభివృద్ధి చేస్తున్న పెరటి మొక్కలు, ఔషధ, ఆయుర్వేద మొక్కలను, పూల మొక్కలను, పలు రకాల పెరటి కోళ్లను పరిశీలించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మొక్కల ఆవశ్యకతను, ప్రయోజనాలను వివరించారు.

ఆగమోక్తంగా తైలాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనీశ్వర స్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు.

శాస్త్రోక్తంగా ఆకాశదీపం



కార్తీక దీపాన్ని ఎగురవేస్తున్న ఈఓ బాపిరెడ్డి దంపతులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఆకాదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతిరోజు ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి దంపతులు ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించండి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. తమ కళాశాలలో అందిస్తున్న విద్యాబోధనపై వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

శ్రీకాళహస్తి: వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విక్రమ్ జూనియర్ కళాశాల విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. పట్టణానికి చెందిన సత్యసేవా సమితి వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో కళాశాలకు చెందిన జాహ్నవి, గాయత్రి,



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

జ్ఞాపిక, స్రవంతి, గుణవర్ధన్, యశ్విని ఉత్తమ ప్రతిభ చూపి మొదటిస్థానం సాధించారు. వీరిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్. కరస్పాండెంట్ మునిలక్ష్మి, అధ్యాపక బృందం అభినందించారు.

భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది అందరూ సంయుక్తంగా కృషి చేసి పరిష్కరించాలని ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి సూచించారు. తొట్టంబేడు రెవెన్యూ కార్యాలయంలో శనివారం తహసీల్దారు మధుసూదన్‌రావు, ఆర్ఐ, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తొట్టంబేడు మండలంలో భూములు చాలా విలువైనవని అంతేకాకుండా పరిశ్రమలు, క్వారీలు అధికంగా ఉన్నాయని, వివిధ భూసమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. ఆదమరిస్తే చాలా ఇబ్బంది వస్తుందని, ఆర్ఐలు, వీఆర్వోలు జాగ్రత్తగా పరిశీలించి అన్ని విధానమైన పత్రాలను చూసి ఏ విధమైన అనుమతులు ఇవ్వాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ చెప్పినా చేయవద్దన్నారు. ప్రతి ఒక్కరినీ కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా వారికి సమయం చెప్పాలని, పరిష్కారం కాకపోతే ఎందుకు కాలేదో వారికి లిఖిత పూర్వకంగా తెలియజెప్పాలని సూచించారు.

స్థలం కేటాయించండి



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

సత్యవేడు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలని కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు కలసి తహసీల్దారుకు టి.సుబ్రమణ్యంకు శనివారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించిన 5 ఎకరాల స్థలాన్ని ఇంటి పట్టాలకు కేటాయించారని వివరించారు. డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేక తెలుగు గంగ కార్యాలయం పాత భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవనం శిథిలావస్థకు చేరడంతో పెచ్చులూడి, వర్షానికి గదులు ఉరుస్తున్నాయని, తరగతుల నిర్వహణ ఇబ్బందిగా ఉందన్నారు. ప్రిన్సిపల్ సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంచాయతీల బలోపేతానికి కృషి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌పీఓ

నారాయణవనం: గ్రామ పంచాయతీలను అందుబాటులో ఉన్న స్థానిక వనరులతో ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేయాలని డీఎల్‌పీవో ప్రభురెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సముదాయం సచివాలయంలో స్వర్ణ పంచాయతీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సంపద కేంద్రాన్ని సందర్శించి, ఆకు కూరలు, తీగ మొక్కల విత్తనాలను ఆయన విత్తారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల ఆదాయ వనరులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. స్వర్ణ పంచాయతీ డేటాను సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించాలని ఆయన ఆదేశించారు. ఈఓపీఆర్డీ డాక్టర్ వేణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సై'ఖతం'



పిల్లపాళెం సమీపంలో స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు

రేణిగుంట: గాజులమండ్యం సమీపంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. స్వర్ణముఖి నది నుంచి యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు చేపడుతూ జేబులు నింపుకుంటున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుక రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు విక్రయిస్తున్నారు. శనివారం సాయంత్రం పిల్లపాళెం సమీపంలోని స్వర్ణముఖి నదిలో రెండు జేసీబీలతో ట్రాక్టర్లు పెట్టి 20 అడుగుల లోతు వరకు ఇసుక తవ్వకాలు చేపట్టారు. టీడీపీ నాయకులు స్వర్ణముఖి నదిలో రాత్రి, పగలు తేడాలేకుండా అక్రమ తవ్వకాలు చేపడుతున్నా.. అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.